క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం



రక్షణ కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

నెల్లూరు నగరంలోని గౌతమినగర్ ఒకటో వీధి అడ్డరోడ్డు (యునైటెడ్ క్రిస్టియన్ చర్చి ఎదురుగా)లో రహదారి పక్కనే ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు రక్షణ కంచె లేదు. పిల్లలకు అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. తక్షణమే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

– నెల్లూరు(క్రైమ్)

రోడ్డెక్కిన మురుగు నీరు


త్రివేణి హాస్పిటల్ వీధిలో మ్యాన్ హోల్ నుంచి బయటకు వస్తున్న మురుగునీరు

నెల్లూరు(బారకాసు): నగరంలోని బృందావనం ప్రాంతంలో ఉన్న త్రివేణి హాస్పిటల్ వీధిలో ఉన్న డ్రైనేజీ మ్యాన్ హోల్ పొంగి రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తోంది. మురుగు నీరంతా సమీపంలో ఖాళీ స్థలంలోకి వెళ్లి నిల్వ చేరుతోంది. దుర్వాసన భరించలేక స్థానికులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తుండడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. మురుగు కారణంగా వ్యాధులు ప్రబలుతాయేమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుకతో వంద కోట్ల స్వాహాకు సోమిరెడ్డి యత్నం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పొదలకూరు : మండలంలోని సూరాయపాళెం ఇసుక రీచ్‌లో ఎమ్మెల్యే సోమిరెడ్డి రూ.వంద కోట్లను స్వాహా చేసేందుకు యత్నిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జెడ్పీటీసీ నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ సోమా అరుణ, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి సోమవారం విలేకరులతో మాట్లాడారు. సిద్ధంగా ఉన్న లక్షల టన్నుల ఇసుకను అక్రమంగా తరలించేందుకు సోమిరెడ్డి రంగం సిద్ధం చేసుకున్నట్టు ఆరోపించారు. పొదలకూరులో వైఎస్సార్‌సీపీకి చెందిన వారి మూడు లేఅవుట్లపైనే చర్యలు తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ముత్తుకూరు ఫ్లైయాష్ బల్కర్ల వద్ద కమీషన్ గుంజుకుంటున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. మా నాయకుడు కాకాణి ఆస్తుల విషయంలో టీడీపీ నేతల సవాల్‌ను స్వీకరిస్తున్నామని, ఆయన ఆస్తుల విలువ వివరిస్తామన్నారు. సోమిరెడ్డి కావాలనే ప్లాట్ల కొనుగోలుదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో పొదలకూరు ఎంపీటీసీ గుంటి శ్రీనివాసులు, వార్డు సభ్యుడు అంజాద్, నాయకులు జి.వేణుగోపాల్‌రెడ్డి, ఖాదర్, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలి



వెంకటాచలం : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి సూచించారు. వెంకటాచలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెల్మెట్ ధరించడంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ద్విచక్ర వాహనదారుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోందని తెలియజేశారు. అయితే ఎక్కువ మంది హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడుపుతున్నారని చెప్పారు. దీని వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోందన్నారు. హెల్మెట్ ధరించడం నిబంధనల కోసమో లేక పోలీసుల జరిమానాల నుంచి తప్పించుకునేందుకు కాకుండా భద్రత కోసం ప్రతి ఒక్కరూ వినియోగించాలని తెలియజేశారు. ఈ సదస్సులో ప్రిన్సిపల్ వరప్రసాద్, ఏఎస్సై శ్రీధర్, న్యాయవాది శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండయ్యా..

నెల్లూరు సిటీ: నెల్లూరు నగరంలోని అనేక ప్రాంతాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. వాటిని తక్షణమే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాలు మొదలైన నేపథ్యంలో తమ సమస్యలను, ఆకాంక్షలను ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించాలని నెల్లూరు నగరం, రూరల్ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రధానంగా నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాల్లోని రోడ్ల అభివృద్ధిపై చర్చించాలని కోరుతున్నారు. నెల్లూరు రూరల్ పరిధిలో అనేక చారిత్రాత్మక నేపథ్యం కలిగిన ఇరుకళల అమ్మవారి దేవస్థానం, రాజరాజేశ్వరి ఆలయం ఉన్నాయని, అలాగే స్వర్ణాలచెరువు తీరంలో బారాషహీద్ దర్గా ఉందని, వీటిని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. పంట కాలువలు అధ్వానంగా ఉన్న నేపథ్యంలో ప్రత్యేక దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


నెల్లూరు నగరంలోని వహాబ్‌పేట సమీపంలో కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారం

రోడ్లకు మరమ్మతులు చేయాలి



నెల్లూరు నగరంలో పలుచోట్ల రోడ్లు గుంతలమయంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై గుంతలు కనపడక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం ప్రజల ఇబ్బందులను గుర్తించి నెల్లూరు నగరంలో మరమ్మతులకు గురైన రోడ్లను బాగు చేయాలి.

– సాజిద్, రంగనాయకులపేట

పారిశుద్ధ్యం మెరుగుపరచాలి



ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు పారిశుద్ధ్యం మెరుగుపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఇంటింటి చెత్తసేకరణ, రోడ్లను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలి. తద్వారా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారు. నెల్లూరు రూరల్‌లోని బారాషహీద్ దర్గాను పర్యాటకంగా అభివృద్ధి చేయాలి.

– ఖాజావలి, గాంధీనగర్

పంట కాలువల్లో పూడికతీయాలి



వర్షాకాలం నేపథ్యంలో ఇళ్ల మధ్య ఉండే మురుగు కాలువలు, పంట కాలువల్లో వెంటనే పూడికతీత పనులు చేపట్టాలి. చెత్తాచెదారాలు పేరుకుపోవడంతో దోమలు విపరీతంగా పెరిగాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. నెల్లూరు రూరల్‌లోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం, రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం అభివృద్ధిపై దృష్టి సారించాలి.

– ఆదినారాయణ, వెంగల్‌రావునగర్

చట్టపర పద్ధతుల్లో బకాయిల వసూలు

నెల్లూరు (వీఆర్సీ సెంటర్): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, డీసీసీబీ ద్వారా ఇచ్చిన రుణాలు వాయిదా మీరిన బకాయిలపై చట్టపర పద్ధతుల్లో వసూలు చేయాలని జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) గుర్రప్ప తెలిపారు. సహకారశాఖ కమిషనర్, రిజిస్ట్రార్ గుంటూరు ఆదేశాలతో ఏపీ సహకార యూనియన్ విజయవాడ, సహకార శిక్షణ కేంద్రం ప్రొద్దుటూరు వారి సహకారంతో సోమవారం ఆయన కార్యాలయం నుంచి ఆన్‌లైన్ ద్వారా డీసీసీబీ మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, సూపర్‌వైజర్లు, సేల్స్ అధికారులు, పీఏసీఎస్ సీఈఓలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సహకార సంఘాలు, డీసీసీబీ, బ్యాంకు బ్రాంచ్‌లు ఇచ్చిన రుణాలకు సంబంధించిన వాయిదా మీరిన బకాయిదారులకు నోటీసులు జారీ చేసే విధానం, సెక్షన్ 61, 71 కోర్టు నిర్వహణ పద్ధతులు, డిక్రీలపై అమలు దరఖాస్తులు దాఖలు చేయడం, బకాయిదారుల స్థిర, చరాస్తులను చట్టపరంగా జప్తు చేసి, వేలం వేసే విధానం వంటి అంశాలపై గుర్రప్ప శిక్షణ ఇచ్చారు. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పనులు వేగవంతం చేయాలని, అన్ని పీఏసీఎస్‌ల్లో ఎరువుల విక్రయ లైసెన్స్‌లు తప్పనిసరిగా పొంది ఉండాలని సూచించారు.


ఆన్‌లైన్ శిక్షణలో మాట్లాడుతున్న డీసీఓ గుర్రప్ప

రామ్మూర్తికి ఘన నివాళి

నెల్లూరు(బారకాసు): సీనియర్ జర్నలిస్టు, సామ్నా అధ్యక్షుడు సర్వేపల్లి రామ్మూర్తి మరణం తీరని లోటని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్ అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన రామ్మూర్తి సంతాప సభలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామ్నా అధ్యక్షుడిగా, సర్వేపల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌గా రామ్మూర్తి ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సామ్నా జిల్లా నాయకులు హనోక్, ప్రతాప్, సుబ్బారావు, సింహపురి బాబు, సుబ్బుసింగ్, రవీంద్రనాథ్‌రెడ్డి, సుధాకర్, మనోహర్‌రెడ్డి, అక్మల్, సుబ్రహ్మణ్యం, సురేష్‌కుమార్, రమేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.


రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

మెదడు పనితీరుపై అవగాహన అవసరం

నెల్లూరు(అర్బన్): మెదడు పనితీరు, ఒత్తిడి, ఇతర కారణాల వల్ల వచ్చే బ్రెయిన్ స్ట్రోక్, మైగ్రేన్, ఎపిలెప్సీ, అల్జీమర్స్ తదితర జబ్బులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నారాయణ ఆస్పత్రి న్యూరాలజీ డాక్టర్ అనూష తెలిపారు. ప్రపంచ మెదడు దినోత్సవం–2024ను పురస్కరించుకుని నగరంలోని హరనాథపురంలో ఉన్న నారాయణ కాన్సెప్ట్ స్కూల్‌లో 9, 10 తరగతుల విద్యార్థులకు సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో డాక్టర్ అనూష మాట్లాడారు. మెదడు పనితీరుపై అవగాహన ఉంటే 50 శాతం మెదడుకు సంబంధిత వ్యాధులను నివారించుకునేందుకు వీలవుతుందన్నారు. కార్యక్రమంలో నారాయణ స్కూల్స్ డీన్ నరేంద్ర, ఏజీఎం రమణారెడ్డి, ప్రిన్సిపల్ వెంగళరావు, ఆస్పత్రి మార్కెటింగ్ రీజినల్ ఇన్‌చార్జి సుదీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

నెల్లూరు(అర్బన్): ప్రపంచ బ్రెయిన్ డేను పురస్కరించుకుని సోమవారం స్థానిక మాగుంట లేఅవుట్‌లోని ఎనెల్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్వహించిన మెదడు–నరాలకు సంబంధించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆస్పత్రి న్యూరాలజీ విభాగం డాక్టర్లు కుంకాల లావణ్య, హరితకుమారి 100 మందికి పైగా రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు, వారి సహాయకులకు ఆస్పత్రిలో అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ లావణ్య మాట్లాడుతూ మారిన ఆహారపు అలవాట్లు, ఒత్తిడితో కూడిన జీవన విధానం వల్ల మెదడు, నరాలకు సంబంధించిన వ్యాధులు వస్తున్నాయన్నారు. జీవన విధానాన్ని మార్చుకోవడం, సకాలంలో ఆహారం తీసుకుని విశ్రాంతి తీసుకోవడం ద్వారా ఈ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని తెలిపారు. తమ ఆస్పత్రిలో ప్రతి నెలా ఒకరోజు ఉచిత వైద్యశిబిరం నిర్వహించి రోగులకు వైద్యసేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ నాగేంద్రప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో పాల్గొన్న డాక్టర్లు, రోగులు

విద్యుత్ సిబ్బందికి అభినందనలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): బారాషహీద్ దర్గాలో 5 రోజులపాటు నిర్వహించిన రొట్టెల పండగలో నిరంతరం విద్యుత్ సరఫరా చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూసిన విద్యుత్ సిబ్బందిని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ అభినందించారు. సోమవారం నగరంలోని విద్యుత్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రొట్టెల పండగ సందర్భంగా విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు శేషాద్రి బాలచంద్ర, సోమశేఖర్‌రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్, అసిస్టెంట్ ఇంజినీర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

కొడవలూరు : మండలంలో మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జి.వసంత కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాలు నార్తురాజుపాళెం, యల్లాయపాళెం, గౌతమ్ నగర్ సచివాలయాల్లో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కొత్తగా ఆధార్ చేయించుకోవాల్సిన వారు, మార్పులు చేర్పులు చేయించుకోవాల్సిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజనుల్లో ఇప్పటికీ అనేక మందికి ఆధార్‌లు లేనందున వారు ప్రభుత్వ రాయితీలు కోల్పోతున్నారని చెప్పారు. వీరికి జిల్లా కలెక్టర్ ప్రత్యేక సౌకర్యం కల్పించారని తెలిపారు. పుట్టిన తేదీ సమస్య వల్ల ఆధార్ పొందలేకపోయారని, ఇప్పుడా సమస్య లేకుండా తహసీల్దార్‌ను సంప్రదిస్తే వారు పుట్టిన తేదీతో లేఖ ఇస్తారన్నారు. ఈ విధంగా ఇచ్చేలా ఇప్పటికే తహసీల్దార్‌లను కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. ఆ లేఖతో కొత్తగా ఆధార్ పొందవచ్చని సూచించారు.

వాటర్ ప్లాంట్ల పరిశీలన


వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పొదలకూరు : వైద్యారోగ్యశాఖ అధికారులు, ఉద్యోగులు పట్టణంలోని పలు వాటర్ ప్లాంట్లను సోమవారం పరిశీలించారు. కో–లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌రిషిత ఆధ్వర్యంలో పట్టణంలోని సచివాలయం బిట్–3 పరిధిలో వాటర్ ప్లాంట్లలో శ్యాంపిల్స్‌ను సేకరించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ సేకరించిన నీటిని 48 గంటల వరకు పర్యవేక్షణలో ఉంచి పరీక్షిస్తామన్నారు. ఆరోగ్య సహాయకులు కామాక్షమ్మ, వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్లు లక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



నెల్లూరు(బారకాసు): మెడికల్ కౌన్సెలింగ్ ప్రారంభించే లోపు ప్రజావ్యతిరేకమైన 107, 108 చట్టాలను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ కులాల సమన్వయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు కోరారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీసీ నాయకులు నాసిన భాస్కర్‌గౌడ్, మొమ్మి కిశోరయాదవ్, డాక్టర్ రాజేష్‌యాదవ్, వేణుగోపాల్, చిన్నయ్య, మధుసూర్యరావు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది చొరవ భేష్

కొడవలూరు : లెప్రసీ కేసుల గుర్తింపులో వైద్యసిబ్బంది చొరవ భేషుగ్గా ఉందని అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి కొనియాడారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా కుష్టుపై ఇంటింటి సర్వే జరుగుతుండడం విదితమే. ఈ సర్వే పరిశీలన నిమిత్తం సోమవారం కొడవలూరుకు వచ్చిన ఆయన వైద్య సిబ్బందితో మాట్లాడి సర్వేపై ఆరా తీశారు. కొడవలూరులో రెండు కేసులను గుర్తించినట్లు సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రాథమిక దశలో కుష్టును గుర్తించడం వల్ల పూర్తిగా నివారించేందుకు అవకాశం ఉందన్నారు. ఇద్దరు కుష్టు బాధితులకు నిర్దేశించిన మందులను ఇచ్చి క్రమం తప్పకుండా వినియోగించేలా చూడాలని ఆదేశించారు. ఆయా మందులను వారు క్రమం తప్పకుండా వాడేలా చూడాల్సిన బాధ్యత కూడా వైద్య సిబ్బందిదేనన్నారు. అన్ని గ్రామాల్లో విస్తృతంగా సర్వే చేయడం ద్వారా కుష్టు బాధితులను ప్రాథమిక దశలోనే గుర్తించాలన్నారు. ఏ ఒక్కరూ వైకల్యం బారిన పడకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం సర్వే నిర్వహిస్తోందని స్పష్టం చేశారు.


కొడవలూరులో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న అదనపు డీఎంహెచ్‌ఓ

పని ప్రదేశంలో మహిళలకు పూర్తి రక్షణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్, ఇతర అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): పని ప్రదేశంలో మహిళలకు పూర్తి రక్షణ కల్పిస్తూ వారి గౌరవాన్ని కాపాడాలని కలెక్టర్ ఒ.ఆనంద్ అన్నారు. మహిళ రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశంలో మహిళలపై లైంగికంగా జరిగే దాడులను నిరోధించేందుకు ప్రతి కార్యాలయంలో కమిటీలు ఏర్పాటు చేయాలని, ఆయా కమిటీల్లో సీనియర్ మహిళా ఉద్యోగితో పాటు ఎన్‌జీఓ ఉండేట్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే జిల్లాస్థాయిలో కూడా కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఈ అంశంపై మహిళా ఉద్యోగులందరికీ సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్, డీఆర్‌ఓ లవన్న, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాథమిక వైద్యుల సేవలు భేష్

నెల్లూరు(అర్బన్): పీఎంపీలు, ఆర్‌ఎంపీలైన గ్రామీణ ప్రాథమిక వైద్యుల సేవలు ఎంతో గొప్పవని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ మెంబర్ దాసరి రాజేంద్రప్రసాద్ అన్నారు. బారాషహీద్ దర్గా వద్ద రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో గ్రామీణ వైద్యులు స్వచ్ఛందంగా పాల్గొని భక్తులకు వైద్యసేవలందించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న రెడ్‌క్రాస్ కార్యాలయంలో గ్రామీణ వైద్యులను సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ వైద్యులైన పీఎంపీలు, ఆర్‌ఎంపీలు అతి తక్కువ ఖర్చుతో పేదలకు వైద్యసేవలు అందిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆరోగ్య సంక్షేమ కార్యక్రమాలైన పల్స్‌పోలియో, టీకాల కార్యక్రమం, సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తదితర వాటిల్లో పాల్గొంటూ ప్రజల పక్షాన ఉంటున్నారన్నారు. అనంతరం కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, కోలా రవీంద్రబాబు, రోజారాణి పలువురిని శాలువాలతో సన్మానించి ప్రశంసా పత్రాలు అందజేశారు. అలాగే రెడ్‌క్రాస్ కార్యక్రమాల్లో పాల్గొన్న పలువురు విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో స్పాస్టిక్ సెంటర్ కన్వీనర్ బలరామయ్యనాయుడు, ఏఓ చంద్రశేఖర్‌రావు, రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



పీఎంపీ, ఆర్‌ఎంపీలను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ కమిటీ నాయకులు

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

• అదనపు కమిషనర్ శర్మద

నెల్లూరు(బారకాసు): ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శర్మద అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉన్న సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. అదనపు కమిషనర్ అర్జీదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గృహాల్లో ట్యాంకులను ప్రతి మూడు సంవత్సరాలకొకసారి శుభ్రం చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్థానిక అమెనిటీ కార్యదర్శులు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు. వర్షాకాలపు సమస్యలను అధిగమించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, అండర్ బ్రిడ్జిలలో వర్షపునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని మురుగు కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల స్థితిగతులపై విభాగాల వారీగా అధికారులతో సమీక్షించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 20 వినతులు వచ్చాయని, అందులో ఇంజినీరింగ్ 6, టౌన్‌ప్లానింగ్ 8, పబ్లిక్ హెల్త్ 2, రెవెన్యూ శాఖ 1, ఆప్కాస్‌కు సంబంధించి 3 వినతులు అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఈ సంపత్‌కుమార్, మేనేజర్ ఇనాయతుల్లా, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అర్జీదారుడి సమస్యను తెలుసుకుంటున్న అదనపు కమిషనర్ శర్మద

మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా స్వర్ణ వెంకయ్య

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా స్వర్ణ వెంకయ్యను 3వ సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతిలో సోమవారం మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు యమాల సుదర్శన్ అధ్యక్షతన మాలమహానాడు రాయలసీమ ఉమ్మడి జిల్లాల ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాలమహానాడు రాష్ట్ర ఉద్యోగ ప్రధాన కార్యదర్శిగా నెల్లూరుకు చెందిన కట్టేటి మోహన్‌కృష్ణ, జిల్లా అధ్యక్షుడిగా బల్లి శరత్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు నాగముని, వెలిచర్ల సాయి, తురక గోపీనాథ్, స్వర్ణ తులసి తదితరులు పాల్గొన్నారు.


ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని సన్మానిస్తున్న నాయకులు